# కమనీయంగా హనుమాన్ శోభాయాత్ర

## భక్తిశ్రద్ధలతో ఆంజనేస్వామి జయంతి వేడుకలు

## భారీ హనుమాన్ విగ్రహంతో ఊరేగింపు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 3 (ప్రజా మంటలు) :** హనుమాన్ జయంతి ఉత్సవాలు ముత్తారం గ్రామంలో వైభవంగా నిర్వహించారు. హనుమాన్ నామస్మరణతో ముత్తారం పుర వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా త్రికుటేశ్వర ఆలయంలో టిటిడిఎస్ హనుమాన్ భక్త బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. గురువారం సాయంత్రం చేపట్టిన ర్యాలీని హవల్దార్ పల్లి, వీరన్న నాయక్ తండా మీదుగా ఆంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై హనుమాన్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ర్యాలీలో యువత జై హనుమాన్ జెండాలతో సందడి చేశారు. సనాతన ధర్మం కోసం హిందూసమాజం ఏకం కావాలని టిటిడిఎస్ భక్త బృందం అన్నారు.ఇంటింటికి కాషాయ జెండా పంపిణీహనుమాన్ జయంతి సందర్భంగా టీటీడీఎస్ (త్రికుటేశ్వర ఆలయ టెంపుల్ డెవలప్మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి కాషాయ జెండాలను పంపిణీ చేశారు. హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ ప్రజల్లో భక్తి, ఐక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఇంటిపై కాషాయ జెండాను ఎగురవేసి ప్రజలు హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.



# కొండగట్టు ఆలయం కు ఈవోలు ఎంత మంది మారిన మార్పు రావడం లేదు

## నాసిరకం లడ్డు ప్రసాదం విక్రయాలు

## చేస్తున్నారంటూ అంటున్న బిజెపి నాయకులు

**గొల్లపల్లి ఏప్రిల్ 03ప్రజా మంటలు :**కొండగట్టు..అంజన్న స్వామి చిన్న జయంతి రోజు లక్షల భక్తులు నడుచుకుంటూ వందల కిలోమీటర్ల నుండి అంజన్న దర్శనం కోసం ఎండలో చెప్పులు లేకుండా చిన్న జయంతి రోజు అంజన దర్శనం చేసుకుని,, అలాగే ,మాల వేసుకున్న స్వాములు,,మాల విరమణ ,, భక్తులు ,,సహజ దర్శనం కోసం లక్షల మంది వస్తూ ఉంటే,,, కొండగట్టు అధికారులు మాత్రం ఎప్పటిలాగే నాసిరకం పందిళ్లు,,, లడ్డు ప్రసాదాల విక్రయాల దగ్గర కూడా నాసిరకమే,, భక్తుల దర్శనానికి ఇలాంటి ఏర్పాటుల వల్ల భక్తులకు చాలా ఇబ్బంది కలుగుతుంది .గుత్తేదారులు మరియు అధికారులు కలిసి కాసులకు కుమ్మక్కు అయి,చిన్న జయంతి రోజు జరిగే ఏర్పాట్లను గుత్తేదారులు ఏ రకంగా నాసిరకంగా ఏర్పాటు చేసినా కూడా కొండగట్టు ఆలయ అధికారులు మాత్రం చూసి చూడనట్టు ప్రవర్తిస్తుంటారు .దీనికి కారణం మొన్న,,జరిగిన సంఘటన వల్ల గుత్తేదారు నాసిరక పనులు వేయడం వల్ల పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తుల. మీద పందిళ్లు కూలి కొంతమంది భక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే తీవ్రంగా గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకు పోవడంలో కూడా అలసత్వం ప్రదర్శించిన అధికారులు ,,వారికి కనీసం 5 లక్షలు ఎక్స్గ్రేసియా,,ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ మల్యాల మండల శాఖ



డిమాండ్ చేస్తా ఉంది .అలాగే ఎవరైతే ఈ చలవ పందిళ్ళు నాసిరకంగా వేసిన గుత్తేదారున్నారో వారి మీద చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేస్తున్నం .ఇది ఒక్కటే కాకుండా లడ్డు ప్రసాదాల,,నాణ్యత లేకపోవడం భక్తులను అంజన్న స్వామిని అవమానపరచడమే,, ఎన్నో మొక్కులు తో కొండగట్టు అంజన్న స్వామిని దర్శించుకుంటామని వందల కిలోమీటర్లు దూరం నుండి వస్తే తీరా ఇక్కడికి వచ్చినాక ఏర్పాట్లలో సరిగా లేకుండా తమకు ఇష్టం వచ్చిన రీతిలో ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కల్పిస్తున్న ఈ అధికారులను అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నాం. స్వయంగా కలెక్టర్ వచ్చి కోనేట్లో నీరు నింపాల్సిందిగా ఆదేశించినా కూడా అంతకు ముందున్న నీరనే కంటిన్యూ చేయడం ,ఇది అధికారుల నిర్లక్ష్యానికి తార్కాణం,,, కొండగట్టు ఆలయం కి ఎంతమంది ఈవోలు మారినా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు నిన్నటి వరకు కూడా జయంతి కోసం ,,ఏర్పాట్లు జరుగుతుండడం ఇది ఎంతవరకు సమంజసం,, ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తూ మాల వేసుకున్న భక్తులు మాల విరమణ కోసం కొండగట్టు అంజన్న స్వామి దర్శనం చేసుకొని మాల విరమణ ,,చేసుకుంటామని వస్తే వారికి కూడా మాల విరమణ దగ్గర ఎలాంటి సేవలు ఏర్పాటు చేయకపోవడం చాలా దారుణం ..కొండగట్టు ఘాట్ రోడ్ నుండి ఆలయం వరకు ఎక్కడ కూడా భక్తుల కోసం కనీసం చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయకపోవడం అధికారులు నిర్లక్ష్యం ..అధికారులకు మరియు పూజారులనీ సమన్వయం చేయకపోవడం కూడా ఇలాంటి పరిస్థితికి దారి తీసింది. ఇదే కాకుండా దర్శనకు వచ్చిన భక్తుల టికెట్ల నుండి మళ్లీ సగం టికెట్లు తీసుకొని ఇతర భక్తులకు అమ్మిన సంఘటనలు కూడా ఉన్నాయి.. కొబ్బరికాయలు కొట్టు స్థలంలో అలాగే టికెట్లు విక్రయించే స్థలంలో అక్రమంగా డబ్బులు వసూలు చేయడం కూడా తప్పు. కూలిన చలవ పందిళ్ళ కింద ఉన్న భక్తులు మీద ఎలక్ట్రిసిటీకి సంబంధించిన లైట్లు వైర్లు పడడం వల్ల భక్తులకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఈ సంఘటనను తేలిగ్గా తీసుకోకుండా దీనిపై ఎంక్వయిరీ వేసి బాధ్యులైన వారిని చట్టరీత్యా చర్యలు తీసుకొని కొండ గట్టుకు వచ్చే భక్తులకి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసున్నం. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు. మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం. బొబ్బిలి వెంకటస్వామి యాదవ్. కెల్లేటి రమేష్. పిల్లి రాజశేఖర్. పొనుగంటి గౌతం. నక్క ఆనందం. పాల్గొన్నారు

# ప్రజాపాలన గందరగోళంలో ప్రజలు

## నిద్రవస్థలో ఎంపీడీఓ కార్యాలయం.

## పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్

**భీమదేవరపల్లి ఏప్రిల్ 03 (ప్రజామంటలు) :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం వాస్తవానికి ప్రజల సమస్యలను పరిష్కరించే కార్యక్రమంగా కాకుండా కేవలం ప్రచార కార్యక్రమంగా మారిపోయిందని మండల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. ప్రభుత్వం 99 రోజుల్లో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు చెప్పుకుంటున్నా, ఇండ్ల నిర్మాణం మాత్రం నత్తనడకన సాగుతోంది. మంజూరైన లబ్ధిదారులు వ్యక్తిగత కారణాలతో ఇల్లు నిర్మించుకోలేకపోతే, ఆ అవకాశం మరో అర్హుడైన దరఖాస్తుదారునికి ఇవ్వాల్సిన బాధ్యత మండల అధికారులపై ఉంది. కానీ మండల ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా అధికారులు స్పందించక పోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. దీనికి ప్రధాన కారణం అవగాహన లేని ఇందిరమ్మ కమిటీలే. మండల వ్యాప్తంగా గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్తు (జీరో బిల్లు) ఎంతమందికి



లభించింది అనే విషయంపై స్పష్టత లేదు. ప్రజలు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ, అధికారులు పట్టించుకోక పోవడంతో అర్హులైన లబ్ధిదారులు నష్టపోయారు. దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారు. వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు పెన్షన్ల కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ మంజూరు కాకపోవడం బాధాకరం. పేదల కోసం ఉన్న పథకాలు పేదలకు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. పారదర్శకత కలిగిన ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలో కొన్ని గ్రామాలకు మాత్రమే ఈజీఎస్ నిధులు మంజూరు చేసి, మరికొన్ని గ్రామాలను పూర్తిగా పక్కన పెట్టడం సవతి ప్రేమ కాదా? ఈ వివక్ష వెనుక ఉన్న అంతర్యం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలి. ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమాల్లో ప్రజలు తక్కువగా, ప్రభుత్వ ప్రతినిధులు ఎక్కువగా కనిపించడం ఈ కార్యక్రమం ప్రజల కోసం కాదని, కేవలం ప్రభుత్వ ప్రచారం కోసమే నిర్వహిస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రచారం మానేసి, ప్రజల సమస్యలు పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నాము. లేకపోతే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తి

## ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**జగిత్యాల ఏప్రిల్ 3(ప్రజా మంటలు)** :తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ 99వ జయంతి సందర్భంగా జగిత్యాల పట్టణ ధర్మపురి రోడ్డు లో విజయపురి లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ కార్యక్రమంలో డి సి సి అధ్యక్షులు గాజంగి నందయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఏ ఎం సి ఛైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,కమిషనర్ స్పందన,కౌన్సిలర్ లు చెట్టే గంగాధర్ , దయాళ చంద్రకళ శంకర్, కోరే జయ గంగమల్లు,పిట్ట ధర్మరాజు,ఏనుగుల లావణ్య రాజు,కూతురు రాజేష్,చీటి లక్ష్మీ నారాయణ,దుమాల రాజ్ కుమార్,హరీష్,మమత రామకృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్ కుసరి అనిల్ కుమార్,జిల్లా కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బీరం రాజేష్,నాయకులు బాల ముకుందం, దయాళ మల్లారెడ్డి పుల్ల మల్లయ్య,కురుమ సంఘం సభ్యులు ,పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల దోపిడీపై కవిత విమర్శలు




**హైదరాబాద్, ఏప్రిల్ 03:**ప్రైవేట్ స్కూల్స్ 3040% వరకు ఫీజులు పెంచి తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తీసుకురావాలని, ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఫీజు పెంపును 78%కి పరిమితం చేయాలని సూచించారు.నారాయణ స్కూల్స్, చైతన్య స్కూల్స్ వంటి కార్పొరేట్ సంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, టీచర్లకు సరైన జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు.ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

**సికింద్రాబాద్, ఏప్రిల్ 03 (ప్రజా మంటలు):** స్వరాజ్య స్థాపన కోసం, ధర్మ రక్షణ కోసం పోరాడిన ధీశాలి ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం ప్రాణాలను సైతం లెక్క చేయని శివాజీ మహారాజ్ ఆశయాలు స్ఫూర్తిదాయకమన్నారు. అప్పట్లో శివాజీ ఏ విధంగా పోరాడారో, నేడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అదే ధర్మ మార్గంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు.



# ఎల్కతుర్తి లో గుడ్ ఫ్రైడే ఆచరణలు భక్తిశ్రద్ధలతో

## సిలువను మోసిన భక్తులు భక్తిశ్రద్ధలతో శోభయాత్ర

**ఎల్కతుర్తి ఏప్రిల్ 03 ప్రజా మంటలు** :హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించారు. యేసు క్రీస్తు సిలువ వేయబడిన దినాన్ని స్మరించుకుంటూ ఫాదర్ జాన్ పాల్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ప్రాంగణం నుంచి సహాయ మాత 14వ స్థలం వరకు వే ఆఫ్ ది క్రాస్ శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సిలువను మోస్తూ ప్రార్థనలు చేస్తూ ముందుకు సాగారు. మార్గమధ్యంలోని ప్రతి స్థలంలో యేసు క్రీస్తు అనుభవించిన బాధలను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సహాయ మాత వద్దకు చేరుకుని సమూహంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయరాజు, సిస్టర్స్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



# చిలకలగూడ పోలీసుల మానవత్వం

## నిరాధారుడికి అండగా నిలిచిన ఇన్‌స్పెక్టర్



**సికింద్రాబాద్, ఏప్రిల్ 03 (ప్రజా మంటలు):** చిలకలగూడ పోలీసుల మానవత్వం మరోసారి వెలుగుచూసింది. గాంధీ ఆసుపత్రి సమీపంలో చెకింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఫుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో ఉన్న నిరాధార వ్యక్తిని గుర్తించి, వెంటనే చికిత్స అందించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.పోలీసుల వివరాల ప్రకారం.. చిలకలగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో గాంధీ ఆసుపత్రి, మెట్రో స్టేషన్ పరిసరాల్లో చెకింగ్ నిర్వహిస్తుండగా, ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి పడివున్నాడు. వెంటనే స్పందించిన పోలీసులు అతన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.తదుపరి రెండు రోజుల పాటు కృషి చేసి అతని చిరునామాను సీతాఫల్‌మండి ప్రాంతంలో గుర్తించారు. అక్కడికి వెళ్లగా, కుటుంబ సభ్యులు అతన్ని నిర్లక్ష్యంగా వదిలేసినట్లు తెలిసింది.దీనిపై ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. లేనిపక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూచించారు.ఈ ఘటన ద్వారా పోలీసుల మానవత్వం, బాధ్యతాయుత వైఖరి ప్రతిఫలించిందని స్థానికులు అభినందిస్తున్నారు.

# పిర్యాదుల పెట్టెను సమకూర్చిన గ్రామ సర్పంచ్

**వేలేరు, ఏప్రిల్ 03 (ప్రజామంటలు) :** మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించేందుకు గ్రామ సర్పంచ్ జక్కుల మౌనిక సంపత్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆవరణలో, మహిళా సంఘం భవనం వద్ద ప్రత్యేకంగా ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలు, అభ్యర్థనలు, సూచనలు వంటి విషయాలను ఈ పెట్టెలో రాసి వేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి ప్రజల సూచనలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రహదారులు, పెన్షన్లు, సంక్షేమ పథకాల అమలు వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును వారానికి ఒకసారి పరిశీలించి సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ ప్రజలు కార్యాలయాలకు తిరగకుండా తమ సమస్యలను సులభంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సూచనల ఆధారంగా గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని పేర్కొన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.



# పీచర సర్పంచ్ అధ్యక్షతన ఘనంగా గ్రామసభ



**వేలేరు ఏప్రిల్ 03 (ప్రజా మంటలు)** :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పీచర గ్రామంలో గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల ఎంపిడిఓ లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మరిజే అనిత-నరసింహారావు అధ్యక్షతన సభను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట అనిల్, గ్రామ పంచాయతీ పాలకవర్గం,వైద్య సిబ్బంది, అంగన్ వాడి టీచర్స్, గ్రామ అధికారులు, మహిళా సంఘాలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**వేలేరు, ఏప్రిల్ 03 (ప్రజా మంటలు):**వేలేరు మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవ సోదరులు భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. యేసు క్రీస్తు శిలువ వేయబడిన దినాన్ని స్మరించుకుంటూ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వాసులు ఉపవాస దీక్షలు పాటిస్తూ, యేసు ప్రభువు త్యాగాన్ని స్మరించుకున్నారు. పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించి శాంతి, సౌభ్రాతృత్వం, ప్రేమను పాటించాలని సందేశం ఇచ్చారు. గ్రామంలో శాంతియుత వాతావరణంలో వేడుకలు కొనసాగగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తులు ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక భావనలో మునిగిపోయారు.




# కొకాపేట్‌లో అక్రమ మైనింగ్ కలకలం

## స్కానర్‌లో భాగ్యలక్ష్మి మైనింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 03 (ప్రజా మంటలు)** :హైదరాబాద్ పరిసర ప్రాంతమైన కొకాపేట్‌లో అక్రమ మైనింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. మీా 261 నిబంధనలను ఉల్లంఘిస్తూ భారీ స్థాయిలో రాక్ క్రషింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.భాగ్యలక్ష్మి మైనింగ్ సంస్థపై పర్యావరణ నాశనం, అక్రమ అనుమతులతో తవ్వకాలు చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. హ్యూమన్ రైట్స్ లాయర్ రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా దృష్టి సారించింది. నిషేధం ఉన్నప్పటికీ అధికార దుర్వినియోగంతో మైనింగ్ కొనసాగుతోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఫిర్యాదును జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణకు స్వీకరించింది. నెంబర్ 6984/ ఐఎన్ /2026 గా కేసు విచారణకు నెంబర్ కేటాయించినట్లు అడ్వకేట్ రామారావు తెలిపారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల పరిసర ప్రాంతాల్లో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ రాక్ క్రషింగ్ కారణంగా కాలుష్యం పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ మైన్స్, చీఫ్ సెక్రటరీ స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని పిటిషన్‌లో కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తక్షణమే మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనతో ప్రభుత్వ పాత్రపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. నిషేధం ఉన్నప్పటికీ మైనింగ్ యథేచ్ఛగా సాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.






# జనగామ గెత్సేమనే ప్రార్థన మందిరములో సిలువ ధ్యానం




**జనగామ, ఏప్రిల్ 03 (ప్రజామంటలు):** గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం జనగామ ప్రగతి నగర్ గెత్సేమనే ప్రార్థన మందిరములో యేసుక్రీస్తు సిలువలో పలికినఏడు మాటలు వివరించారు. క్రీస్తు జ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్, ప్రవక్త,రెవ. సంగాల పాల్సన్ రాజ్, సొసైటీ ఆఫ్ క్రైస్ట్ జనరల్ సెక్రటరీ రెవ.డాక్టర్ జయప్రకాశ్ గోపు సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు. సంఘకాపరి బ్రదర్ హనోకు అధ్వర్యంలో యేసుక్రీస్తు సిలువలో పలికిన మొదటి మాట క్షమాపణ,రెండవ మాట రక్షణ, "మూడవ మాట సంబంధం,నాల్గవ మాట వేదన ఐదవ మాట శరీర శ్రమ,ఆరవమాట విజయం ఏడవ మాట సమర్పణ కలిగినఈ ఏడు మాటలు వివరించారు. సంఘ కార్యదర్శి కాగితాల రవి, డి.కళాంజలి, అమ్మనగంటి స్వప్న, ఇనుముల ప్రవీణ, కొంపెల్లి ప్రేమలత మాటలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘనాయకులు జి.కృష్ణ, ఇనుముల నర్సయ్య,మెకానికల్ రవి, మేడబోయిన ఇశ్రాయిల్ జాన్ రాజ్, మంద బాల్ రాజ్, దిగోజు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య తో పాటు క్రీడలను ప్రోత్సహిస్తుందని జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ అన్నారు.

**జగిత్యాల ఏప్రిల్ 3 (ప్రజా మంటలు) :**ధరూర్ క్యాంప్ రామాలయం కళ్యాణ మండపం లో గురువారం జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2026 -27 పోటీలను జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు.చదువుతోపాటు క్రీడల పట్ల శ్రద్ధ చూపిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. తల్లితండ్రులతోపాటు స్వచ్ఛంద సంస్థలు సైతం క్రీడలను ప్రోత్సహించాలన్నారు. క్రీడలతో మానసిక స్థైర్యం పెంపొందడమే కాకుండా, చదువు పట్ల మరింత శ్రద్ధ ఏర్పడుతుందన్నారు. జూన్ నెలలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని జగిత్యాల కు మంచి పేరు తేవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు చారి ,మంచాల కృష్ణ, టీవీ సూర్యం, సిరిసిల్ల శ్రీనివాస్ , కోచ్ రామాంజనేయులు, సంతోష్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



